పేదల బియ్యం.. డీలర్ల భోజ్యం

- 20 కిలోలకు 16, 15 కిలోలకు 12 కిలోలే పంపిణీ
- స్టాకు పాయింట్‌పై నెట్టేస్తున్న డీలర్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్డుదారులు

రాప్తాడు: పేదలకు చౌక దుకాణాల నుంచి ఉచితంగా అందించే రేషన్ బియ్యం సరఫరాలో దోపిడీ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డీలర్లు పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా కేవలం ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే రెండు మూడు కోటాలు సక్రమంగా పంపిణీ చేసిన తర్వాత కోతలు మొదలు పెట్టారు. రాప్తాడు మండలంలో రాప్తాడు, లింగనపల్లి, బొమ్మేపర్తి, మరూరు, గొందిరెడ్డిపల్లి, ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి, ముట్టాల, సనప, చెన్నేకొత్తపల్లి మండలంలో మేడాపురం, నాగసముద్రం, న్యామద్దల, కనగానపల్లి మండలంలో మద్దెల చెరువు, తగరకుంట, తూంచెర్ల తదితర గ్రామాల్లో బియ్యాన్ని తక్కువగా ఇస్తున్నారని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 25 కేజీలు ఇవ్వాల్సిన వారికి 21 కేజీలు, 20 కేజీలు ఇవ్వాల్సిన వారికి 16 కేజీలు, 15 కేజీలు ఇవ్వాల్సిన వారికి 12 కేజీలు మాత్రమే ఇవ్వడంపై లబ్ధిదారులు బహిరంగంగా డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలతో పాటు తండాలు ఉన్నాయి. చాలా మంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. రేషన్ సరుకుల కొన ప్రతి నెలా వారు గ్రామాలకు వచ్చి వెళ్తుంటారు. అలాంటి వారికి తూకాల్లో తక్కువ రావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బియ్యంతో పాటు కంది బేడలు, నూనె, చక్కెర, బెల్లం, రాగులు, జొన్నలు ఇవ్వగా కూటమి ప్రభుత్వంలో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు.


రాప్తాడులో రేషన్ సరుకుల కోసం బారులు తీరిన కార్డుదారులు

రెచ్చిపోతున్న డీలర్లు

ఈనెల కోట బియ్యం తక్కువగా వచ్చింది.. ఈనెల తంబు వేస్తేనే మళ్లీ నెల బియ్యం ఇస్తాం.. లేదంటే మళ్లీ నెల బియ్యం కూడా ఇవ్వం అంటూ రాప్తాడులో ఓ డీలర్ కార్డుదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. బియ్యం ఇవ్వనిదే తంబు ఎలా వేస్తామంటూ కార్డుదారులు ప్రశ్నిస్తే.. నోరు మూసుకుని తంబు వేసి ఇంటికి వెళ్లండి.. లేదంటే బియ్యం ఇచ్చేది లేదు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నాడు. దాదాపు 30 మంది కార్డుదారులు చేసేది ఏమీ లేక తంబు వేసి ఇంటికి వెళ్లారు. గత ప్రభుత్వంలో ఇలా జరగలేదని.. ఈ ప్రభుత్వంలో తంబు వేపించుకుని బియ్యం లేవంటూ తమపై డీలర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని చెబుతున్నారు.


రాప్తాడులో 20 కేజీల బియ్యానికి 16 కేజీలే ఇచ్చిన దృశ్యం

రాప్తాడు నియోజకవర్గంలో రేషన్ షాపుల వివరాలు		
మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డుల సంఖ్య
రాప్తాడు	32	12,579
ఆత్మకూరు	34	12,362
అనంతపురం రూరల్	77	41,507
రామగిరి	32	11,006
కనగానపల్లి	34	13,530
చెన్నేకొత్తపల్లి	46	14,624

తప్పెవరిది?

డీలర్లేమో తమకు స్టాకు పాయింట్ నుంచి ప్రతి నెలా తక్కువ తూకాలు వస్తున్నాయని అంటున్నారు. స్టాకు పాయింట్ అధికారులు ఏమో కచ్చితమైన తూకాలతో గ్రామాలకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. అయితే రేషన్ సరుకులు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? లేదా అనే దానిపై అధికారులు ఎక్కడా తనిఖీలు చేసినట్లు కనిపించడం లేదు.

మళ్లీ నెల ఇస్తామన్నారు



ఈనెల రేషన్ సరుకులకు రాప్తాడులోని ఓ రేషన్ షాపుకు వెళ్లాను. అక్కడ నాతో పాటు దాదాపు 20 మంది కార్డుదారులతో డీలర్ తంబు వేపించుకుంది. ఈనెల స్టాకు తక్కువగా వచ్చిందని.. వచ్చే నెలలో రెండు నెలల కోటా బియ్యం ఒకే సారి ఇస్తానని చెప్పింది. వచ్చే నెలలో గత నెలకు సంబంధించిన కోటా బియ్యం ఇస్తుందో లేదో అర్థం కావడం లేదు. ఒక వేళ గత నెల నేను బియ్యం ఇచ్చాను అని చెబితే ఏమి చేయాలో తెలియడం లేదు. మాలాంటి పేదలకు ఇలా చేస్తే ఎలా..

– శకుంతల, రాప్తాడు

బియ్యం తక్కువ ఇస్తున్నారు



రాప్తాడులో ఓ రేషన్ షాపులో 20 కేజీల బియ్యానికి కేలవం 16 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారు. తూకం మిషన్‌పై ఇనుప డబ్బా ఉంచి బియ్యం వేస్తున్నారు. ఇనుప డబ్బాను లెస్ చేయాలని చెబితే.. ఆ డీలర్ భర్త నేను బియ్యం వేసేది ఇలానే.. తీసుకుంటే తీసుకో లేదంటే బయటకు వెళ్లు అని చెబుతున్నాడు. ఈ నెల కోటా బియ్యం కోసం వెళ్లగా బియ్యం అయిపోయాయి అంటూ తెగేసి చెబుతున్నాడు. ఈ విషయంపై నాలుగు నెలల క్రితమే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అయినా ఆ డీలర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

– లక్ష్మన్న, మాజీ డీలర్, రాప్తాడు

బియ్యం తక్కువ ఇస్తే కఠిన చర్యలు



కార్డుదారులకు ఎవరికైనా డీలర్లు తక్కువగా బియ్యం ఇస్తున్నారని తమకు ఫిర్యాదు చేస్తే ఆ డీలర్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యం తక్కువగా ఇస్తున్నారని మాకు ఎవరూ కార్డుదారులు ఫిర్యాదు చేయలేదు. స్టాక్ పాయింట్ నుంచి కూడా బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్లు కూడా ఫిర్యాదు చేయలేదు. ఇప్పటి నుంచి ఎవరికైనా డీలర్లు కార్డుదారులకు తక్కువగా బియ్యం ఇస్తే తమకు ఫిర్యాదు చేయాలి. తంబు వేసిన వెంటనే ప్రతి డీలర్ కార్డుదారుడికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి. మళ్లీ నెల ఇస్తామని తంబు వేపించుకుని నిత్యావర వస్తువులు ఇవ్వకపోవడం నేరం అవుతుంది.

– విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం రాత్రి వసంతపురం గ్రామంలో సిబ్బందితో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. పేకాట, జూదం వంటివి వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలతో సమస్యల గురించి ఆరా తీశారు.

వేరుశనగ పొట్టు దగ్ధం

నల్లచెరువు: మండల కేంద్రంలోని హరి వేరుశనగ మిల్లు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మిల్లు ఆవరణలో ఉన్న వేరుశనగపొట్టుతో సహా రైతు ఆదినారాయణకు సంబంధించిన గడ్డివామి దగ్ధమైంది. మంటలు రామనాథం, నగేష్ మిల్లుల సమీపానికి వ్యాపించడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరకుని మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది. ఘటనలో సుమారు రూ.2.5 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి

పుట్టపర్తి టౌన్: అమడుగూరు మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కుమారుడు తరుణ్(17) శనివారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి (వాసు) ఆదివారం కదిరి ప్రభుత్వాసుపత్రికి చేరుకొని తరుణ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మనధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ కవితా శివశంకర్‌రెడ్డి, నాయకులు సేవేనాయక్, చీకిరేవుల పల్లి శంకర్, శ్రీనివాసులు, కేశవ తదితరలు ఉన్నారు.

ఎమ్మెల్యే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న బంజారా ఉద్యోగులు

కదిరి అర్బన్: ఇటీవల అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి బోయ, వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చాలని ప్రతిపాదించారని, వెంటనే ఆమె వాటిని ఉపసంహరించుకోవాలని బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు అనిల్‌నాయక్, నాగరాజునాయక్, క్రిష్టానాయక్, రవినాయక్ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. బోయ, వాల్మీకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో నేడు చాలావెనుకబడి ఉన్నారని, తండాల్లో కనీస సౌకర్యాలు లేక దుర్భర జీవితాలను గడుపుతున్నారని తెలిపారు. వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేరిస్తే ఎస్టీలకు అన్యాయం జరుగుతుందన్నారు. వాల్మీకులకు ఎస్టీ జాబితాలోకి చేర్చే ప్రతిపాదన సరికాదన్నారు.

ఖాద్రీశుడి సన్నిధిలో 'అనంత' కలెక్టర్


కలెక్టర్ శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని ఆదివారం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కలెక్టర్ కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, అధికారులు కలెక్టర్‌ను సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపు


మాట్లాడుతున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి శిబిరం ద్వారా పేదలకు కంటి చూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో 137 మందికి కంటి పరీక్షలు చేయగా 102 మంది కంటి శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారని తెలిపారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. అనంతరం వైద్యులు, దాతలను శాలువాలతో సత్కరించారు. రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కార్యదర్శి నాగభూషణ, సభ్యులు శ్రీనివాసరెడ్డి, కొండయ్య, రమేష్, బీవీ చలం, శివయ్య, మనోహర్‌గుప్త, పెరుమాళ్‌దాస్, ప్రసన్నకుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, అంబికా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు సాక్షి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా జోలికి పోవద్దు


మాట్లాడుతున్న ఎక్సైజ్ జిల్లా అధికారి గోవిందనాయక్

పుట్టపర్తి టౌన్: నాటుసారాతో ఆరోగ్యం దెబ్బతింటుందని, దాని జోలికి పోవద్దని జిల్లా ఎక్సైజ్ అధికారి గోవింద్‌నాయక్ ప్రజలకు సూచించారు. పుట్టపర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లమాడ, బుక్కపట్నం మండలం రెడ్డిపల్లి తండా, మదిరేబైలు తండాలో ఎక్సైజ్ అధికారులు ఆదివారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనపై అవగాహన, కళాజాతా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ నాటుసారాతో జీవితాలు నాశనమవడంతోపాటు కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. నాటుసారా తయారు చేయొద్దని, కుటుంబ పోషణకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తుందన్నారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రాజు, వీఆర్‌ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న అశోక్, ప్రముఖులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్, మెగా డీఎస్సీ అభ్యర్థుల కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతపురం పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ సెంటర్‌లో ఆదివారం వదాన్య సొసైటీ ఫౌండర్ అశోక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, డైరెక్టర్ బీఎంఎస్ రవి, డిస్కవరీ అనంత అనీల్, పర్యావరణవేత్త ఎస్‌కే లెనిన్, బాబు, న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 14 ఏళ్లుగా నిరుపేద విద్యార్థుల కోసం వదాన్య సొసైటీ ఎన్నో కార్యక్రమాలు, టాలెంట్ టెస్టులు నిర్వహించిందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం, మెగా డీఎస్సీ అభ్యర్థులకు శ్రీసత్యసాయి జిల్లాలో కొత్తచెరువు కేంద్రంగా గతేడాది డిసెంబర్‌లో పరీక్ష నిర్వహించగా 4,200 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వారిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, అభ్యర్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. డీఎస్సీ టెస్ట్ టాపర్స్ మంజుల, విశ్వనాథ్, చెన్నారెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నరసింహ, లోకేష్, ఓబుళేసుకు రూ.4 లక్షల వరకు నగదు బహుమతులు అందజేసినట్లు వివరించారు.

నిత్యం వెలుగులే!

బత్తలపల్లి: మండల కేంద్రంలో వీధిలైట్లు నిత్యం వెలుగుతూనే కనిపిస్తున్నాయి. వాటికి ఆన్ అండ్ ఆఫ్ లేకపోవడం వల్ల వాటిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, వడ్డెర కాలనీ, ఇందిరమ్మ నగర్‌లోనూ నిత్యం వీధిలైట్లు వెలుగుతూ కనిపిస్తున్నాయి. వాటికి స్విచ్చులు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


వడ్డెర కాలనీలో వెలుగుతున్న వీధిలైట్లు


ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో వెలుగుతున్న వీధిలైట్లు

ఇండియా గెలుపుపై సంబరాలు


జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న యువకులు

బత్తలపల్లి: దుబాయ్‌లో న్యూజిలాండ్‌తో ఆదివారం రాత్రి జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొందడంతో బత్తలపల్లిలో సంబరాలు అంబరాన్నంటాయి. క్రికెట్ ప్రేమికులు బత్తలపల్లి కూడలికి చేరుకుని పెద్ద ఎత్తున బాణసంచాలు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో క్రికెట్ ప్రేమికులు చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బాణసంచాలు కాలుస్తూ కేరింతలు కొడుతూ ఇండియా, ఇండియా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు సహకరించండి


ముష్టూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: సంజీవపురం గ్రామ సమీపంలోని కాటి కోటేశ్వరక్షేత్రంలో ఈ నెల 12 నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ప్రజలు సహకరించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ కోరారు. మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో ఆదివారం వారు పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. ఉత్సవాలను ఎప్పటి నుంచి ఎప్పటి వరకు నిర్వహించేది ఆలయ కమిటీ సభ్యులను అడగి తెలుసుకున్నారు. ఉత్సవాలు జరిగే సమయంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఉత్సవాలు ఐదు రోజులు పాటు నిర్వహిస్తారని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా భద్రత

పుట్టపర్తిటౌన్: కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరుకానున్న నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ రత్న అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఎస్పీ అధికారులతో కలసి సత్యసాయి విమానాశ్రయాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించి భద్రతపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, సీఐలు సునీత, సురేష్ పాల్గొన్నారు.

మామిడి మొక్కల పెరికివేత

ముదిగుబ్బ: ఎనుమలవారిపల్లిలో నారాయణ స్వామి అనే రైతు పొలంలో ఆదివారం మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు పెరికేశారు. బాధిత రైతు వివరాల మేరకు.. నారాయణస్వామి తనకున్న రెండెకరాల పొలంలో 20 రోజుల క్రితం 80 మామిడి మొక్కలు నాటాడు. ఉదయం రైతు పొలంలో వెళ్లగా మొక్కలు పెరికేసినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

13న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 13న అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసు నడపనున్నట్లు డీఎం మైనోద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13న ఉదయం 10–30 గంటలకు బస్టాండ్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు బయలుదేరుతుందని తెలిపారు. బస్సు గోల్డెన్ టెంపుల్ దర్శనానంతరం చేసుకుని అరుణాచలం వెళ్తుందని పేర్కొన్నారు. నల్లచెరువు, తనకల్లు, ములకలచెరువు, చిత్తూరు జిల్లా అంగళ్లలో బోర్డింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకే గ్రామం నుంచి 35 మందికి పైగా వెళ్లేవారికి ఆ గ్రామానికే బస్సు పంపిస్తామని పేర్కొన్నారు. చార్జీ రూ.1,140 ఉంటుందని, ఆన్‌లైన్‌లో సర్వీసు నెంబర్ 15303 ఫోన్‌పేతో టికెట్ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9959225892 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య సహాయకులను విధుల్లోకి తీసుకోవాలి

పుట్టపర్తి అర్బన్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల(ఆరోగ్య సహాయకులు)ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హెల్త్ అసిస్టెంట్లను తొలగించి నాలుగు నెలలవుతోందని, దీంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారి పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

'ఫీజు పోరు'ను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డి

తనకల్లు: ఈ నెల 12న పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ సీనియర్ నాయకుడు దేశాయి సంజీవరెడ్డి స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అందకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫీజు పోరు, యువత పోరుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. అనంతరం మండల కన్వీనర్‌గా కొత్తగా నియమితుడైన అశోక్‌వర్ధన్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మహిళా కన్వీనర్ విజయలక్ష్మీ, ఎంపీటీసీలు హిమధర్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచులు కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేంద్ర, చిన్నపరెడ్డి, వార్డ్ మెంబర్ బాబ్‌జాన్, నాయకులు భక్తవత్సలరెడ్డి, బడా నాగభూషణ్ రెడ్డి, కొండా మల్లికార్జున, నరేంద్ర, సూరి, బీఎస్ కలాం, ముస్తఫా, మోహన్, రెడ్డిపీరా, దొరస్వామి, సుకుమార్‌రెడ్డి, బీఎస్ నిజాం, వినోద్, సమరసింహారెడ్డి, మాధవ్‌రెడ్డి, శంకర్ రెడ్డి, పూల శంకర్, నరసింహారెడ్డి, చంద్రమోహన్, ప్రకాష్, బయారెడ్డి, అబ్దుల్, ఆది, మధు, చంద్ర, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నల్లమాడ: మండలంలోని మూలప్పగారిపల్లికి చెందిన మాజీ రెస్కో చైర్మన్ సోమగుట్ట గంగిరెడ్డి (76) అనారోగ్యంతో శనివారం మృతిచెందిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ఆదివారం మూలప్పగారిపల్లికి వెళ్లి గంగిరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్. రాంమోహన్‌రెడ్డి, సూర్యనారాయణ, కురుమాల సర్పంచ్ లింగమూర్తి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీల రూపంలో విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

పెద్దమ్మ తల్లికి మారుపూజ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన గ్రామ దేవత పెద్దమ్మతల్లికి ఆదివారం మారు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి జాతర అనంతరం మారు పూజ చేయడం ఆనవాయితీగా వస్తోందని పూజారులు పెద్దన్న, శివసాయి తెలిపారు. అమ్మవారికి వెండి ఆభరణాలు, కిరీటం, భుజకిరీటాలు, బంతి పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తాదులు అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించారు. మహిళలు అమ్మవారికి వడి బియ్యం, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

ఓడీచెరువు: తొట్లివారిపల్లి శివారులో కోడి పందెం ఆడుతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పందెం ఆడుతున్న వారిని అరెస్టు చేసి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

ముదిగుబ్బ: రైతు సమస్యలపై సోమవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు ఆటో పెద్దన్న, వెంకటేష్ కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ మోటర్లకు అమర్చే ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ డిమాండ్లపై ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.